ఆంధ్ర ప్రదేశ్ మరియు తెలంగాణ
అన్ని నియోజకవర్గాలలో విజ్ఞాన్ పత్రికకు విలేఖరులు కావలెను
ఫోన్ నెం. 99517 75293

VIGNAN PATRIKA

APTEL/2024/89102

# విజ్ఞాన్ పత్రిక

తెలుగు దినపత్రిక (Telugu Daily Paper)

సంపుటి : 02 సంచిక : 45 ఎడిటర్ : కలికి ఉదయ్ కుమార్ రెడ్డి శనివారం 14 మార్చి 2026 పేజీలు : 04 వెల : 02



## మూడో విడత 'అన్నదాత సుఖీభవ-పీఎం కిసాన్' నిధులు విడుదల

- కూటమి ప్రభుత్వ ఉగాది కానుకగా మూడో విడత నిధుల విడుదల
- 46.85 లక్షలమంది రైతులకు రూ.6 వేల చొప్పున జమ
- గన్నవరంలో అన్నదాత సుఖీభవ- పీఎం కిసాన్ కార్యక్రమాన్ని ప్రారంభించిన చంద్రబాబు
- 24 గంటల్లో రైతుల ఖాతాల్లో నగదు జమ
- ఆక్వా కల్చర్ రైతులకు రాయితీ కింద రూ.810 కోట్లు ఇచ్చాం
- రైతులకు వ్యవసాయ పనిముట్లు ఇచ్చాం.
- డిజిటల్ క్రాప్ సర్వే చేయిస్తున్నాం
- చెరువులు బాగు చేసి నీరు నింపేలా చర్యలు తీసుకున్నాం

**వారు రాజకీయాల్లో ఉండటానికి అర్హత ఉందా**

**" రైతుల ఇళ్ల వద్దకు వెళ్తాం, పంటలపై అవగాహన కల్పిస్తాం. ఇప్పుడు అన్నం తినేవారు తగ్గిపోతున్నారు, రైతులు గమనించాలి. డిమాండ్ ఆధారిత పంటలు వేసేలా రైతులను ప్రోత్సహిస్తాం. నూజివీడు మామిడి, అరకు కాఫీ, గుంటూరు మిరప చాలా ప్రసిద్ధి. ఏలూరు సమీపంలో 500 ఎకరాల్లో కోకో సిటీ తెస్తున్నాం. ఏ పంటలు వేయాలో రైతులు కలిసి చర్చించుకోవాలి. ప్రతిచోటా భూసార పరీక్షలు చేయిస్తున్నాం. రైతులకు ఎప్పటికప్పుడు వాతావరణ వివరాలు చెబుతున్నాం. వ్యవసాయ ఆధారిత పరిశ్రమలు మరిన్ని రావాలి. గన్నవరం విమానాశ్రయం నుంచి విదేశాలకు ఎగుమతులు పెరగాలి. ఎక్కడికక్కడ ఫుడ్ ప్రాసెసింగ్ చేసేలా ఏర్పాట్లు చేస్తున్నాం. గల్ఫ్ యుద్ధం వల్ల రాయలసీమ నుంచి అరటి ఎగుమతి ఆగింది." - సీఎం చంద్రబాబు**

వ్యవసాయంలో రైతులకు సాంకేతిక సహకారం అందించేలా త్వరలోనే ఏఐ ఆగ్రోనమిస్ట్‌ను రాష్ట్రమంతటా అందుబాటులోకి తెస్తామని సీఎం చంద్రబాబు ప్రకటించారు. పెట్టుబడి సాయం కింద అన్నదాత– సుఖీభవ నిధులను కృష్ణా జిల్లా గన్నవరం నియోజకవర్గం సూరంపల్లిలో నేడు విడుదల చేశారు.

## ఈశాన్యంలో శాంతి వీచికలు

- ♦ బీజేపీ ప్రభుత్వం వచ్చాకే అభివృద్ధి పరుగులు
- ♦ అస్సాం పర్యటనలో ప్రధాని నరేంద్ర మోదీ వెల్లడి
- ♦ రూ. 19,680 కోట్ల అభివృద్ధి ప్రాజెక్టులు ప్రారంభం
- ♦ పీఎం--కిసాన్ సమ్మాన్ నిధి 22వ విడత సొమ్ము విడుదల
- ♦ తేయాకు కార్మికుల రుణం తీర్చుకుంటున్నా
- ♦ కాంగ్రెస్‌ది అబద్ధాల దుకాణం



## పేదలకు శత్రువులం కాదు: సీఎం రేవంత్

- ❖ మూసీ నిరాశ్రయులకు ఆయా నియోజకవర్గాల్లోనే ఇళ్లు
- ❖ 'మూసీ ఇన్‌వైట్' కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి
- ❖ నది పునరుజ్జీవంతో రాష్ట్రం గ్రోత్ ఇంజిన్‌గా మారుతుంది
- ❖ కానీ కొందరు ఉద్దేశపూర్వకంగా దు?రష్ప్రచారం చేస్తున్నారు
- ❖ కడుపులో కుళ్లు, మాటల్లో విషంతో అడ్డుకోవాలని చూస్తున్నారు
- ❖ రాజకీయ స్వార్థం కోసం చరిత్రను కాలగర్భంలో కలిపేద్దామా?
- ❖ బాధితులకు ఎలాంటి పరిహారం ఇద్దామో చెబితే దాన్ని అమలు చేద్దాం
- ❖ ఏవైనా లోపాలు ఉంటే సలహాలు, సూచనలు ఇస్తే స్వీకరిస్తామన్న సీఎం
- ❖ అసలు పథకమే వద్దంటే మాత్రం వినే ప్రసక్తే లేదని స్పష్టీకరణ



మూసీ పునరుజ్జీవ పథకం అమలులో ఏవైనా లోపాలుంటే సూచనలు, సలహాలు ఇస్తే స్వీకరిస్తామని, మరింత అద్భుతంగా తీర్చిదిద్దడానికి ప్రయత్నిస్తామని, అసలు పథకమే వద్దంటే మాత్రం వినే ప్రసక్తే లేదని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తేల్చి చెప్పారు. తమ ప్రభుత్వం పేదలకు శత్రువు కాదని, వారిని నిరాశ్రయులను చేసే ఆలోచన లేదని స్పష్టం చేశారు. మూసీ పునరుజ్జీవంలో నిరాశ్రయులకు ఆయా నియోజకవర్గాల్లో ప్రభుత్వ స్థలం ఉంటే.. అక్కడే ఇళ్లు కట్టించి ఇస్తామని ప్రకటించారు. ఈ ప్రాజెక్టు ఎవరికీ వ్యతిరేకం కాదని, ఎవరి ఆస్తులూ గుంజుకునేందుకు కాదని అన్నారు.

## రెచ్చిపోతున్న సిలిండర్ చోరులు!

దేశ పౌరులు బంగారం, వెండే కాదు.. గ్యాస్ సిలిండర్లు కూడా భద్రంగా దాచుకోవాల్సిన పరిస్థితి ఇప్పుడు ఏర్పడేలా ఉంది. తీవ్ర కొరతతో బ్లాక్‌మార్కెట్‌లో గ్యాస్ ధర భగ్గుమంటుండటంతో ఇప్పుడు దేశంలో గ్యాస్ సిలిండర్ల చోరీలు కూడా ప్రారంభమయ్యాయి. దొంగలు ఇండ్లు, హోటళ్లపై దాడిచేసి సిలిండర్లను ఎత్తుకుపోతున్నారు. కేరళ, కర్ణాటకలో గ్యాస్ సిలిండర్లు చోరీ అయినట్టు కేసులు నమోదయ్యాయి. కేరళలోని తిరువనంతపురంలోని వీఎస్ హోటల్‌లో అర్ధరాత్రి రెండు గంటలకు గ్యాస్ సిలిండర్ చోరీ అయ్యింది. గుర్తు తెలియని ఒక వ్యక్తి హోటల్ ప్రాంగణంలోకి ప్రవేశించి సీసీటీవీలు పనిచేయకుండా మెయిన్ స్విచ్ ఆఫ్ చేశాడు.

## 'అసౌకర్యానికి క్షమాపణలు

నాణ్యమైన ఆహారం అందిస్తాం'
చీడికాడ హాస్టల్ విద్యార్థినులకు లోకేశ్ హామీ
ముగ్గురు సభ్యుల కమిటీతో విచారణ
రంగంలోకి దిగిన బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత
హాస్టల్ సిబ్బంది నిర్లక్ష్యంపై సీరియస్
పాత సిబ్బంది మొత్తం మార్పు



## హర్మూజ్‌ను మేం మూసేయలేదు

- ✶ యుద్ధాన్ని మొదలుపెట్టిన వాళ్లే ఆపాలి
- ✶ భారత్‌లో ఇరాన్ సుప్రీం లీడర్ ప్రతినిధి
- ✶ అమెరికా, ఇజ్రాయెల్‌లే ఇరాన్‌పై యుద్ధాన్ని రుద్దాయి
- ✶ దీనివల్లే చమురు ధరలు పెరుగుతున్నాయి
- ✶ ట్రంప్‌పై నేతలంతా ఒత్తిడి పెంచాలి
- ✶ యుద్ధాన్ని ఆపేయమని డిమాండ్ చేయాలి
- ✶ భారత్‌లోని ఇరాన్ సుప్రీం లీడర్ ప్రతినిధి అబ్దుల్ మాజిద్




హర్మూజ్ జలసంధిని ఇరాన్ మూసివేయలేదని, ఇప్పటికీ కొన్ని నౌకలు దాని మీదుగా రాకపోకలను కొనసాగిస్తున్నాయని భారత్‌లోని ఇరాన్ సుప్రీం లీడర్ ప్రతినిధి డాక్టర్ అబ్దుల్ మాజిద్ హకీమ్ ఇలాహీ స్పష్టం చేశారు. అయితే పశ్చిమాసియాలో ప్రస్తుతం నెలకొన్న ఉద్రిక్తతల వల్ల నౌకలు హర్మూజ్‌ను దాటడంలో అంతరాయం ఏర్పడుతోందన్నారు.

## శశికళ కొత్త పార్టీ ప్రారంభం

**-పార్టీ పేరు ఏపీఎంఎంకే... గుర్తు కొబ్బరి చెట్లు**

తమిళనాట అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న వేళ మరో పార్టీ ఆవిష్కృతమైంది. దివంగత ముఖ్యమంత్రి జయలలిత సన్నిహితురాలు, అన్నాడీఎంకే బహిష్కృత నాయకురాలు వీకే శశికళ కొత్తగా స్థాపించిన పార్టీ పేరును 'ఆలిండియా పురచ్చి తలైవర్ మక్కల్ మున్నేట్ర కళగం' (ఏపీఎంఎంకే)గా ప్రకటించారు. నాలుగు కొబ్బరి చెట్లతో కూడిన పార్టీ చిహ్నాన్ని కూడా ప్రదర్శించారు. స్థానిక పోయట?సగార్డెన్‌లోని తన నివాసంలో శుక్రవారం జరిగిన మీడియా సమావేశంలో ఈ వివరాలు వెల్లడించారు. పార్టీ గుర్తుకు ఎన్నికల సంఘం అనుమతి కూడా ఇచ్చిందని తెలిపారు. ఈ సందర్భంగా శశికళ మాట్లాడుతూ.. తమ పార్టీ వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో తమిళనాడు, పుదుచ్చేరిల్లో పోటీ చేస్తుందని, అన్నాడీఎంకేలోని అసమ్మతివాదులతో కలిసి ముందుకు సాగుతామని పేర్కొన్నారు. డీఎంకేని అధికారం నుంచి దించివేయడమే తన లక్ష్యమని తెలిపారు. ప్రజా సమస్యల పట్ల చిత్తశుద్ధిలేని డీఎంకే, అన్నాడీఎంకేల గురించి ప్రజలకు వివరించి ఓట్లు అడుగుతామని వివరించారు.



## రాజ్యాంగం ప్రజల గొంతుక

- ✶ గాడ్సే, వీర్‌సావర్క్‌ది కాదు : రాహుల్ గాంధీ
- ✶ సంవిధాన్ సమ్మేళన్ కార్యక్రమం
- ✶ కార్యక్రమంలో పాల్గొన్న కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ
- ✶ కేంద్రంపై విమర్శలు
- ✶ అమెరికా కోసం మోదీ పనిచేస్తున్నారు : రాహుల్



**"దేశం పురోగతి సాధిస్తుంటే అందులో పేదలు వారి నేపథ్యంతో సంబంధం లేకుండా ఉండాలి. దేశంలోని 500 అతిపెద్ద కంపెనీల జాబితాను రూపొందించండి. అందులో సీఈఓలు, పెద్ద పెద్ద స్థాయిలో ఉన్నవారిని గుర్తించండి. అప్పుడు ఎన్ని కంపెనీల్లో దళితులు, ఆదివాసీలు, ఓబీసీలు, ఈబీసీలు, మైనార్టీలు సీఈఓ, పెద్ద పొజిషన్‌లో ఉన్నారో చూడండి. ఒక్కరూ కూడా ఉండరు. అలాగే అదానీ గ్రూప్ సంస్థల ఉద్యోగుల జాబితాను చూడండి.**

# మూడో విడత 'అన్నదాత సుఖీభవ–పీఎం కిసాన్' నిధులు విడుదల

46లక్షల 85వేల మంది రైతుల ఖాతాల్లో రూ.6 వేల చొప్పున జమ చేసినట్లు ప్రకటించారు. ఈ సందర్భంగా ఏలూరు జిల్లాలో 500 ఎకరాల్లో కోకో సిటీ ఏర్పాటు చేస్తామని సీఎం చంద్రబాబు చెప్పారు. యుద్ధం వల్ల కోడిగుడ్లు, సీమ అరటి ఉత్పత్తుల ఎగుమతులు ఆగిపోయాయన్నారు. రాష్ట్రాభివృద్ధిలో రైతులది కీలక పాత్ర అని అన్నారు. వ్యవసాయంలో ఆధునిక టెక్నాలజీ వాడేలా ప్రోత్సహిస్తున్నామన్నారు. సాగు పద్ధతుల్లో ఆధునికీకరణ తెస్తున్నామని చెప్పారు.

24 గంటల్లో రైతుల ఖాతాల్లో నగదు జమ : "రైతుల కోసం అనేక కార్యక్రమాలు అమలు చేస్తున్నాం. పంటలకు సమయానికి సాగునీరు అందిస్తున్నాం. పట్టిసీమ ద్వారా గోదావరి నీటిని కృష్ణా జలాలతో కలిపాం. రాష్ట్రాన్ని పునర్నిర్మాణం చేస్తామని ఆ రోజు చెప్పాం. మీరు అండగా నిలిచారు. ఈ 20 నెలల్లో ఒక్కో అడుగు ముందుకేశాం, సమస్యలు పరిష్కరిస్తున్నాం. అనేక సమస్యలున్నా రైతుల కోసం అనేక పనులు చేశాం. ధాన్యం సేకరించాక 24 గంటల్లో మీ ఖాతాల్లో నగదు జమ చేశాం. రైతు ఇబ్బంది పడకూడదనే అనేక రకాలుగా ఆదుకుంటున్నాం. ఇప్పుడు ఒక్కో రైతుకు రూ.6 వేలు ఇస్తున్నాం. రైతుల ఖాతాల్లో ఏటా రూ.20వేలు జమ చేస్తున్నాం. కేంద్రం రూ.6వేలు ఇస్తే రాష్ట్ర ప్రభుత్వం రూ.14 వేలు ఇస్తోంది" అని చంద్రబాబు తెలిపారు.

ఆ బాధ్యత సాగునీటి సంఘాలదే : " ఆక్వా కల్చర్ రైతులకు రాయితీ కింద రూ.810 కోట్లు ఇచ్చాం. రైతులకు వ్యవసాయ పనిముట్లు ఇచ్చాం. డిజిటల్ క్రాప్ సర్వే చేయిస్తున్నాం. చెరువులు బాగు చేసి నీరు నింపేలా చర్యలు తీసుకున్నాం. ఖరీఫ్, రబీకి వాడుకున్నా ఇంకా చెరువుల్లో నీళ్లున్నాయి. మేం చేపట్టిన చర్యలతో భూగర్భజలాలు పెరిగాయి. కాలువల్లో పూడిక తీయాలని, డ్రెయిన్లు బాగు చేయాలని ఆదేశించాం. నీటి భద్రత ఇచ్చే బాధ్యత సాగునీటి సంఘాలదే. భూగర్భ జలాలు పెంచాలి. చివరి భూములకూ నీళ్లు ఇవ్వాలి. గోదావరి పుష్కరాలకు ముందే పోలవరం పూర్తి చేస్తాం. కృష్ణా డెల్టా మొత్తం సస్యశ్యామలం చేస్తాం. రైతుల ఇళ్ల వద్దకు వెళ్తాం, పంటలపై అవగాహన కల్పిస్తాం. డిమాండ్ ఆధారిత పంటలు వేసేలా రైతులను ప్రోత్సహిస్తాం. వ్యవసాయ ఆధారిత పరిశ్రమలు మరిన్ని రావాలి. గన్నవరం విమానాశ్రయం నుంచి విదేశాలకు ఎగుమతులు పెరగాలి. ఎక్కడికక్కడ ఫుడ్ ప్రాసెసింగ్ చేసేలా ఏర్పాట్లు చేస్తున్నాం" అని చంద్రబాబు అన్నారు.

**వారు రాజకీయాల్లో ఉండటానికి అర్హత ఉందా? :** వైఎస్సార్సీపీ వాళు చేసిన పాపాలు గురించి మాట్లాడితే ప్రజలకు వాళ్ల అసలు స్వరూపం బయటపడుతుందనే భయంతో కోర్టులకు వెళ్తున్నారని ముఖ్యమంత్రి చంద్రబాబు దుయ్యబట్టారు. అలాంటి వాళ్లు రాజకీయాల్లో ఉండటానికి అర్హత ఉందా? అని నిలదీశారు. లడ్డూ అంశంపై ఎవరూ మాట్లాడకూడదని సుప్రీంకు వెళ్లారని మండిపడ్డారు. నాడు వివేకా హత్య విషయంలోనూ, చెల్లెలు సునీతారెడ్డిని కూడా మోసం చేశారని ధ్వజమెత్తారు. ఎన్నికలయ్యాక కోర్టుకు వెళ్లి వివేకా హత్యపై ఎవరూ మాట్లాడకూడదని గ్యాగ్ ఆర్డర్ తెచ్చారని చంద్రబాబు తెలిపారు. ఇప్పుడూ కల్తీ నెయ్యితో లడ్డూను అపవిత్రం చేసి ఎవరూ మాట్లాడకూడదని కోర్టుకు వెళ్లారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాజకీయాల్లో ఉండే ఎవరైనా పద్ధతి ప్రకారం పని చేయాలని హితవుపలికారు. తాను హిందువును హిందూ మతం పాటిస్తానని, ముస్లింల సాంప్రదాయాలను, క్రిస్టియన్లను, చర్చిలను గౌరవిస్తానని తెలిపారు. హిందూ దేవాలయాల పవిత్ర కాపాడాల్సిన బాధ్యత తనపై ఉందని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు.

# పేదలకు శత్రువులం కాదు: సీఎం రేవంత్

పేదలతో శత్రుత్వం పెంచుకుంటే మళ్లీ ఎవరైనా అధికారంలోకి వస్తారా? అని ప్రశ్నించారు.

ఇది భవిష్యత్ తరాల కోసం చేస్తున్న అభివృద్ధి అని, ప్రకృతిని, పర్యావరణాన్ని కాపాడుకోవడం మన కర్తవ్యమని పేర్కొన్నారు. దాదాపు 115 సంవత్సరాల కిందట అప్పటి నిజాం నవాబు ఎంతో దూరదృష్టితో చేసిన మంచి పనుల్లో కనీసం మనం పది శాతం కూడా చేయకుండా ఈ నగరాన్ని అలాగే వదిలేద్దామా? అని ప్రశ్నించారు. శుక్రవారం హైదరాబాద్‌లోని ఓ హోటల్‌లో 'మూసీ ఇన్‌వైట్'పేరుతో ప్రాజెక్టుకు సంబంధించిన వివరాలను అధికారులు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. తర్వాత ప్రజా ప్రతినిధులు, పారిశ్రామికవేత్తలు, రియల్ ఎస్టేట్ వ్యాపారులు, పర్యావరణవేత్తలు, మేధావులు, పలు సంస్థల కన్సల్టెంట్లను ఉద్దేశించి సీఎం మాట్లాడారు.

**బ్యూటిఫికేషన్.. లూటిఫికేషన్ అంటూ అసత్యాలు**

'ప్రభుత్వం మంచి కార్యక్రమం చేపడుతున్నప్పుడు మేధావులు దానిని సమర్థించేలా మాట్లాడాలి. కొన్ని రాజకీయ పార్టీలు కడుపులో కుళ్లు, మాటల్లో విషం, చూపుల్లో పగతో వ్యవహరిస్తున్నాయి. రాజకీయ స్వార్థం కోసం ఘనమైన చరిత్రను కాలగర్భంలో కలిపేలా వ్యవహరిస్తున్నాయి. అక్రమ సంపాదునతో ప్రతీనెలా రూ.5 కోట్లు వ్యయం చేస్తూ సోషల్ మీడియాలో దు్?రష్పచారం చేస్తున్నారు. మూసీ బ్యూటిఫికేషన్.. లూటిఫికేషన్ అంటున్నారు. ప్రజలను ఆందోళనకు గురిచేసేలా కొంతమంది ఉద్దేశ పూర్వకంగా, మరికొందరు అసంపూర్ణ సమాచారంతో అర్ధ సత్యాలను ప్రచారం చేస్తున్నారు.

**గాంధీ విగ్రహానికి రూ.75 కోట్లు మాత్రమే..**

రూ.5 వేల కోట్లతో గాంధీ విగ్రహం అంటూ సొంత తెలివి ప్రదర్శిస్తున్నారు. నిజానికి గాంధీ విగ్రహానికి అయ్యే వ్యయం రూ.75 కోట్లు మాత్రమే. ఈ ప్రాజెక్టు మొత్తం 55 కిలోమీటర్లు కాగా.. తొలిదశలో గాంధీ సరోవర్ వరకు 21 కిలోమీటర్ల అభివృద్ధికి అయ్యే వ్యయం కేవలం రూ.7 వేల కోట్లు మాత్రమే. మహాత్ముడి సిద్ధాంతాలను ముందుకు తీసుకెళ్లాల్సిన బాధ్యత మనపై లేదా? మన చరిత్రను తిరిగి రాసుకునే అవకాశాన్ని మనం వదులుకుందామా? దేవతలు యజ్ఞాలు చేసినపుడు రాక్షసులు భగ్నం చేసే ప్రయత్నం చేశారు. సుబాహు, మారీచుడు అడ్డుకునే ప్రయత్నం చేస్తే లోక కళ్యాణం కోసం చేసే యజ్ఞం ఆగిందా? లోకకళ్యాణం కోసం చేసే పనులకు సహకరించక పోయినా పరవాలేదు. కానీ అడ్డుకునే ప్రయత్నం మాత్రం చేయొద్దు..' అని సీఎం విజ్ఞప్తి చేశారు.

**నది చుట్టూనే నాగరికత అభివృద్ధి:** 'మానవ నాగరికత నది చుట్టూనే అభివృద్ధి చెందింది. 1908 మూసీ వరదలు నగరాన్ని ముంచెత్తిన తర్వాత.. నగరాన్ని కాపాడుకోవాలనే ఉద్దేశంతో అప్పటి నిజాం ఉస్మాన్‌సాగర్, హిమాయత్‌సాగర్‌లను నిర్మించారు. ప్రస్తుతం వందేళు దాటినా ఆ రిజర్వాయర్లు నగర ప్రజలతో పాటు, వలసలు వచ్చిన లక్షలాది మంది దాహార్తి తీరుస్తున్నాయి. హైదరాబాద్ నగరాన్ని నిజాం ఎకనామిక్ జోన్‌గా తీర్చిదిద్దారు. పాలకులు మారినా నగర అభివృద్ధి ఆగలేదుం. అలాంటి నగరాన్ని కాపాడుకోవడం మనకర్తవ్యం. 1994 నుంచి ఇప్పటివరకు పరిపాలనలో విధా న నిర్ణయాల్లో వెనుకబడటం ఎప్పుడూ లేదు. పదేళ్లు రాష్ట్రాన్ని పరిపాలించిన వాళ్లు ఎందుకు మూసీ ప్రక్షాళన అడ్డుకుంటున్నారు? వారసత్వ సంపద కలిగిన ఈ నగరాన్ని ఇలాగే వదిలేద్దామా? మూసీ పునరుజ్జీవం జరిగితే కాంగ్రెస్‌కు, రేవంత్‌రెడ్డికి మంచి పేరు వస్తుందని, ఇక వాళ్లకు అధికారం కలగా మిగిలిపోతుందనే అడ్డుకునే ప్రయత్నం చేస్తున్నారు. దార్శనికతతో అభివృద్ధి ప్రణాళికలు రచించి అభివృద్ధి చేసిన వారే చరిత్రలో గుర్తుంటారు..'అని అన్నారు.

# 'అసౌకర్యానికి క్షమాపణలు

ప్రభుత్వ హాస్టళ్లు, పాఠశాలల్లో చదివే విద్యార్థుల భోజనం విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే ఇక ఉపేక్షించేది లేదని రాష్ట్ర ప్రభుత్వం తేల్చిచెప్పింది. అనకాపల్లి జిల్లా చీడికాడలోని ప్రభుత్వ పాఠశాల, బీసీ బాలికల హాస్టల్‌లో జరిగిన నాసిరకం భోజనం, ఆహార కొరత ఘటనపై రాష్ట్ర విద్యా, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ ఎక్స్? వేదికగా? స్పందించారు. ఈ ఘటన పట్ల విచారం వ్యక్తం చేస్తూ విద్యార్థులు, తల్లిదండ్రులకు ఆయన స్వయంగా క్షమాపణలు చెప్పారు. ఈ ఒక్క ఘటనపై విద్యాశాఖ, బీసీ సంక్షేమ శాఖలు సంయుక్తంగా కొరడా ఝుళిపించాయి. ఈ ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు ఇలా ఉన్నాయి.

**కలత చెందిన లోకేశ్?, విద్యార్థినులకు క్షమాపణలు :** చీడికాడ బీసీ హాస్టల్, స్కూల్లో ఆహార కొరత ఉందన్న విషయం సోషల్ మీడియా ద్వారా మంత్రి లోకేశ్? దృష్టికి వచ్చింది. దీనిపై ఆయన వెంటనే స్పందించారు. ఈ ఘటన తనను ఎంతో కలతకు గురి చేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. సమస్యను దాచిపెట్టకుండా ధైర్యంగా తన దృష్టికి తెచ్చిన విద్యార్థినులకు ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు. "అమ్మా, ఈ విషయాన్ని నాకు చెప్పినందుకు కృతజ్ఞతలు. మీరు ఎదుర్కొన్న ఈ అసౌకర్యానికి నేను మనస్ఫూర్తిగా క్షమాపణలు చెబుతున్నాను" అని ఎక్స్?లో పోస్ట్? చేశారు. అక్కడ ఉన్న తన చెల్లెమ్మలకు పోషకాలతో కూడిన నాణ్యమైన ఆహారం అందేలా చూస్తానని భరోసా ఇచ్చారు.

**వెంటనే యాక్షన్, హెచ్‌ఎంపై సస్పెన్షన్ వేటు :** ఫిర్యాదు అందిన వెంటనే మంత్రి లోకేశ్? విచారణకు ఆదేశించారు. వాస్తవాలు తెలుసుకునేందుకు అధికారులతో ముగ్గురు సభ్యుల కమిటీని వేశారు. ఆ కమిటీ ఇచ్చిన రిపోర్ట్ ఆధారంగా తప్పు జరిగిందని ప్రభుత్వం నిర్ధారించింది. వెంటనే నాసిరకం భోజనం సరఫరా చేసిన ఫుడ్ ఏజెన్సీని తొలగించారు. ఆ బాధ్యతను వేరే వారికి అప్పగించారు. బడిలో పర్యవేక్షణలో విఫలమైన ప్రధానోపాధ్యాయుడిని (హెచ్‌ఎం) తక్షణమే సస్పెండ్ చేస్తూ నిర్ణయం తీసుకున్నారు.

మంత్రి సవిత సీరియస్, పాత సిబ్బంది ఔట్ : ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేందుకు మంత్రి లోకేశ్, ఈ విషయాన్ని బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత దృష్టికి తీసుకెళ్లారు. మంత్రి సవిత వేగంగా స్పందించారు. చీడికాడ హాస్టల్ పరిస్థితులపై క్షేత్రస్థాయి విచారణ చేయించారు. ప్రస్తుతం ప్రభుత్వ హాస్టల్ భవనంలో మరమ్మతులు జరుగుతున్నాయని, అందుకే ప్రైవేట్ భవనంలో హాస్టల్ నిర్వహిస్తున్నట్లు ఆమె తెలిపారు. వసతులు లేక విద్యార్థినులు ఇబ్బందులు పడుతున్న మాట వాస్తవమేనని చెప్పారు. అయితే, హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ (హెచ్‌డబ్ల్యూఓ) విధులకు సరిగా రావడం లేదని అధికారుల విచారణలో తేలింది. ఇతర సిబ్బంది కూడా విద్యార్థినుల పట్ల కనీస శ్రద్ధ చూపడం లేదని ప్రభుత్వం గుర్తించింది. పసిపిల్లల పట్ల నిర్లక్ష్యంగా ఉన్న పాత సిబ్బందిని పూర్తిగా మార్చేయాలని మంత్రి సవిత ఆదేశించారు. వారిపై కఠిన చర్యలకు ప్రతిపాదించారు.

ఇకపై 'లీప్' యాప్ ద్వారా పర్యవేక్షణ : ఇలాంటి ఘటనలు భవిష్యత్తులో మళ్లీ పునరావృతం కాకుండా ప్రభుత్వం ముందస్తు చర్యలు చేపట్టింది. ప్రభుత్వ స్కూళ్లలో విద్యార్థులకు అత్యుత్తమ సంరక్షణ దక్కాలని, అది తాము కచ్చితంగా అందిస్తామని మంత్రి నారా లోకేశ్? స్పష్టం చేశారు. ఇందుకోసం పర్యవేక్షణను మరింత బలోపేతం చేస్తున్నట్లు వెల్లడించారు. ఇకపై తల్లిదండ్రుల నుంచి నేరుగా ఫీడ్‌బ్యాక్ తీసుకునేలా 'లీప్' యాప్‌ను వాడుకోనున్నట్లు ప్రకటించారు. దీని ద్వారా హాస్టళ్లు, స్కూళ్లలో ఎక్కడైనా ఆహార సమస్య ఉంటే, వెంటనే అది అధికారుల దృష్టికి (ఫ్లాగ్) వస్తుందని వివరించారు.

# ఈశాన్యంలో శాంతి వీచికలు

గువాహటి: ఒకప్పుడు బాంబులు, తుపాకుల మోతతో దద్దరిల్లిన ఈశాన్య భారతదేశంలో నేడు శాంతి పవనాలు వీస్తున్నాయని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చెప్పారు. బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాతే ఇక్కడ అశాంతి అంతమై, అభివృద్ధి పరుగు ఆరంభమైందని స్పష్టంచేశారు. ఈశాన్య ప్రాంతానికి సంబంధించి కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో స్వార్థ రాజకీయాల కోసమే కొన్ని ఒప్పందాలు కుదుర్చుకున్నారని ఆరోపించారు. ప్రధాని మోదీ శుక్రవారం అస్సాంలో పర్యటించారు. మౌలిక సదుపాయాలు, ఇంధన రంగాల్లో రూ.19,680 కోట్ల విలువైన అభివృద్ధి ప్రాజెక్టులను జాతికి అంకితం చేశారు. మరికొన్ని ప్రాజెక్టులకు పునాదిరాయి వేశారు. అలాగే పీఎం––కిసాన్ సమ్మాన్ నిధి 22వ విడత కింద దేశవ్యాప్తంగా 9.3 కోట్ల మంది రైతుల ఖాతాల్లో రూ.2,000 చొప్పున జమ చేశారు. కోక్రాఝార్ జిల్లాలో జరిగిన బహిరంగ సభను ఉద్దేశించి రాజధాని గువాహటి నుంచి వర్చువల్‌గా ప్రసంగించారు. ప్రతికూల వాతావరణం వల్ల ప్రధానమంత్రి కోక్రాఝార్‌కు చేరుకోలేకపోయారు. డబుల్ ఇంజన్ ప్రభుత్వ పాలనలో అస్సాంలో నూతన అధ్యాయం మొదలైందని, ఇక్కడ పూర్తిస్థాయిలో శాంతియుత పరిస్థితులు నెలకొన్నాయని, శరవేగంగా అభివృద్ధి జరుగుతోందని వెల్లడించారు. గతంలో అధికారం చెలాయించిన కాంగ్రెస్ ప్రభుత్వం జాతీయ భద్రతను పణంగా పెట్టిందని, స్థానికుల భూములను చొరబాటుదారులకు కట్టబెట్టిందని మండిపడ్డారు. అస్సాంలో రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు గట్టిగా బుద్ధిచెప్పాలని ప్రజలకు పిలుపునిచ్చారు.

**తేయాకు కార్మికుల రుణం తీర్చుకుంటున్నా**

అస్సాంలో తేయాకు తోటల కార్మికులకు జరిగిన అన్యాయాన్ని తాము సరిదిద్దినట్లు ప్రధానమంత్రి మోదీ చెప్పారు. భూములపై వారికి హక్కులు కల్పించామని, పట్టాలు అందజేశామని అన్నారు. ప్రధాని మోదీ స్వయంగా మూడు కుటుంబాలకు పట్టాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఒక మహిళా కార్మికురాలికి మోదీ పాదాభివందనం చేశారు. కార్మికులకు న్యాయం చేసినందుకు హిమంత బిశ్వ శర్మ ప్రభుత్వాన్ని అభినందించారు. అస్సాం కార్మికులు పండించిన తేయాకు గుజరాత్‌కు వస్తోందని, అక్కడ ఆ తేయాకుతో తేనీరు తయారు చేసి విక్రయించానని తెలిపారు. ఛాయ్‌వాలాగా పనిచేసి ఈ స్థాయికి చేరుకున్నానని చెప్పారు. భూమి పట్టాలు ఇవ్వడం ద్వారా తేయాకు కార్మికుల రుణం తీర్చుకుంటున్నానని స్పష్టంచేశారు.

**కాంగ్రెస్‌ది అబద్ధాల దుకాణం**

ప్రేమ దుకాణం(మొహబ్బత్ కీ దుకాణ్) తెరిచామంటూ కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ చేస్తున్న ప్రచారాన్ని ప్రధానమంత్రి తిప్పికొట్టారు. కాంగ్రెస్ అబద్ధాల దుకాణం(ఝూటే వైదో కీ దుకాణ్) తెరిచిందని విమర్శించారు. అక్కడ ఒక అబద్ధానికి మరో నాలుగు సూపర్ అబద్ధాలు బహుమతిగా లభిస్తాయని ఎద్దేవా చేశారు. ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయాలన్న ఆలోచన కాంగ్రెస్‌కు ఏనాడూ లేదన్నారు. హామీలు నిలబెట్టుకోవడమే లక్ష్యంగా డబుల్ ఇంజన్ ప్రభుత్వం పని చేస్తోందని స్పష్టం చేశారు.

# హర్మూజ్‌ను మేం మూసేయలేదు

ఆ జలసంధిని మూసివేయాలని ఇరాన్ అస్సలు కోరుకోవడం లేదని ఆయన తేల్చి చెప్పారు. అమెరికా, ఇజ్రాయెల్‌లు అన్యాయంగా ఇరాన్‌పై రుద్దిన ఈ యుద్ధం వల్ల ముడి చమురు, ఇంధన ధరలు పెరిగిపోయి ప్రపంచ దేశాల ప్రజలు ఇబ్బందిపడుతున్నారని తెలిపారు. ప్రపంచ దేశాల నేతలంతా ఏకమై ఇరాన్‌పై యుద్ధాన్ని ఆపమని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌పై ఒత్తిడిని పెంచాలని అబ్దుల్ మాజిద్ హకీమ్ ఇలాహీ డిమాండ్ చేశారు. ఈ యుద్ధాన్ని మొదలుపెట్టిన వాళ్లే ఆపాల్సి ఉంటుందన్నారు.

ఇరాన్ పోరాడుతూనే ఉంటుంది– ఆత్మగౌరవాన్ని అమ్ముకోదు!

"హర్మూజ్ జలసంధి మీదుగా భారత్‌కు వచ్చే నౌకలు, ఆయిల్ ట్యాంకర్లకు అనుమతులు ఇచ్చే అంశంపై ప్రస్తుతం చర్చలు జరుగుతున్నట్లు తెలుస్తోంది. దీనివల్ల భారత్‌కు లబ్ధి జరుగుతుందని ఆశిస్తున్నాను. ముడి చమురు, సహజ వాయువు, ఇతర వనరులు భారత్‌కు చేరుతాయని అనుకుంటున్నాను. అయితే ఈ సంక్షోభానికి శాశ్వత పరిష్కారం ఒక్కటే ఉంది. ప్రజల సంక్షేమం కోసం ప్రపంచ దేశాల నేతలంతా ఏకం కావాలి. వాళ్లంతా కలిసికట్టుగా అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌పై ఒత్తిడిని పెంచాలి. ఇరాన్‌పై యుద్ధాన్ని ఆపమని డిమాండ్ చేయాలి. ఇరాన్‌లోని సామాన్య ప్రజలపై అమెరికా చేస్తున్న దాడులను ఆపమని అడగాలి. ఈ యుద్ధాన్ని ఆపేలా ఇజ్రాయెల్ పాలకులపైనా ఒత్తిడిని పెంచాల్సిన అవసరం ఉంది. ఈ యుద్ధాన్ని ఇరాన్ మొదలుపెట్టలేదు. మమ్మల్ని బలవంతంగా ఈ యుద్ధంలోకి ఈడ్చారు. చివరి రక్తపు బొట్టు వరకు ఇరాన్ పోరాడుతూనే ఉంటుంది. కానీ ఆత్మగౌరవాన్ని అమ్ముకోదు" అని భారత్‌లోని ఇరాన్ సుప్రీం లీడర్ ప్రతినిధి డాక్టర్ అబ్దుల్ మాజిద్ హకీమ్ ఇలాహీ తెలిపారు.

హర్మూజ్‌లో అంతరాయాన్ని తొలగించేందుకు మేం రెడీ : అమెరికా హర్మూజ్ జలసంధి మూసివేతను కొనసాగించాలని ఇరాన్ సుప్రీం లీడర్ ముజ్తబా ఖమేనీ చేసిన ప్రకటనను అమెరికా రక్షణమంత్రి పీట్ హెగ్సెత్ ఖండించారు. ఆ జలసంధి మీదుగా నౌకలు, ఆయిల్ ట్యాంకర్ల రాకపోకలకు అంతరాయాన్ని తొలగించేందుకు అమెరికా సర్వసన్నద్ధంగా ఉందని ఆయన వెల్లడించారు. అమెరికా జాయింట్ చీఫ్స్ ఆఫ్ స్టాప్, జనరల్ డ్యాన్ కెయిన్‌తో కలిసి నిర్వహించిన మీడియా సమావేశంలో పీట్ హెగ్సెత్ ఈ ప్రకటన చేశారు. ఇరాన్ పూర్తి నైరాశ్యాన్ని హర్మూజ్ జలసంధిలో ప్రదర్శిస్తోందని, దాని గురించి ఆందోళన అక్కర్లేదని ఆయన పేర్కొన్నారు. ఆ విషయాన్ని అమెరికా చూసుకుంటుందన్నారు. కేవలం నౌకలపై ఇరాన్ దాడులు చేస్తున్నందు వల్లే ప్రస్తుతం హర్మూజ్ మీదుగా రాకపోకలు ఆగిపోయాయని పీట్ హెగ్సెత్ చెప్పారు.

శత్రుదేశాల చమురు, గ్యాస్ సదుపాయాలకు నిప్పు పెడతాం!

ఇరాన్ సైన్యం అమెరికా– ఇజ్రాయెల్‌లకు శుక్రవారం ఉదయం కీలక హెచ్చరిక చేసింది. తమ దేశ ఇంధన మౌలిక సదుపాయాలు, ఓడరేవులపై దాడులు చేస్తే, వాటి చమురు, గ్యాస్ మౌలిక సదుపాయాలకు నిప్పు పెడతామని వెల్లడించింది. శత్రుదేశాలకు పశ్చాత్తాపాన్ని మిగిల్చే రీతిలో ఇరాన్ సైనికులు ప్రభావవంతమైన ప్రతిఘటనను కొనసాగించాలని ప్రజానీకం కోరుకుంటున్నారని తెలిపింది. హర్మూజ్ జలసంధి మూసివేత ద్వారా ఒత్తిడిని పెంచే వ్యూహం అమలును కొనసాగిస్తామని పేర్కొంది. అమెరికా, ఇజ్రాయెల్‌లకు అంతగా అనుభవం లేని, బలహీనంగా ఉన్న విభాగాల్లో అదనంగా పోరాటాన్ని మొదలుపెట్టే అంశంపై అధ్యయనం చేశామని ఇరాన్ సైన్యం అధికార ప్రతినిధి వెల్లడించారు. ఒకవేళ యుద్ధ పరిస్థితులు ఇలాగే కొనసాగితే, ఇరాన్ ప్రయోజనాల పరిరక్షణ కోసం ఆయా అదనపు విభాగాలతోనూ పోరాటాన్ని మొదలుపెడతామని తెలిపారు.

**భారత్‌ను గట్టెక్కించిన వైవిధ్యం**

ఇరాన్‌లోని హర్మూజ్ జలసంధి అనేది అత్యంత కీలకమైన సముద్ర రవాణా మార్గం. ఇది పర్షియన్ గల్ఫ్ ప్రాంతాన్ని, గల్ఫ్ ఆఫ్ ఒమన్, అరేబియా సముద్రాలతో అనుసంధానం చేస్తుంది. ప్రపంచవ్యాప్తంగా రోజూ సముద్ర మార్గంలో సప్లై అయ్యే ముడి చమురు, సహజ వాయువుల్లో 20 శాతం హర్మూజ్ మీదుగానే వెళ్తుంటుంది. భారత్ ఒకప్పుడు ముడి చమురు కోసం ఎక్కువగా పశ్చిమాసియాలోని అరబ్ దేశాలపైనే ఆధారపడేది. కానీ గత పదేళ్లలో భారత సర్కారు వ్యూహాన్ని మార్చింది. ప్రస్తుతం దాదాపు 40 దేశాల నుంచి ముడి చమురును భారత్ కొనుగోలు చేస్తోంది. ఈ వైవిధ్యం కారణంగానే హర్మూజ్ జలసంధి మీదుగా రాకపోకలు స్తంభించినా, భారత్‌లో పెట్రోల్, డీజిల్‌ల కొరత ఏర్పడలేదు. ప్రస్తుతం భారత్ కొనుగోలు చేస్తున్న ముడి చమురులో 30 శాతమే హర్మూజ్ జలసంధి మీదుగా వస్తోంది. మిగతా 70 శాతం ముడి చమురు ఇతరత్రా రూట్ల మీదుగా భారత్‌కు చేరుతోంది. ప్రపంచంలో ముడి చమురు దిగుమతిపరంగా నంబర్ 3 స్థానంలో భారత్ ఉంది. ఆయిల్ రిఫైనరీల కెపాసిటీలో ప్రపంచంలో నంబర్ 4 స్థానంలో మనదేశం ఉంది. ఇక విదేశాలకు పెట్రోలియం ఉత్పత్తులను ఎగుమతి చేసే విభాగంలో భారత్ 5వ స్థానంలో ఉంది.

# రాజ్యాంగం ప్రజల గొంతుక

**అక్కడ పెద్ద హోదాలో ఒక్క దళితుడు, వెనుకబడిన తరగతి, ఎస్టీ వ్యక్తి కనిపించరు. రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్‌లోని ప్రచారక్‌లను చూడండి. అక్కడ ఓబీసీ, దళిత, ఆదివాసీ వర్గాలకు చెందిన ఒక్క ప్రచారక్ కూడా మీకు కనిపించరు. ఇదే బీజేపీ రాజకీయ విధానం."**

**--రాహుల్ గాంధీ, కాంగ్రెస్ ఎంపీ**

రాజ్యాంగం ప్రజల గొంతుకని, నాథూరామ్ గాడ్సే, వీర్ సావర్కర్‌లది కాదని లోక్‌సభలో విపక్షనేత, కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ తెలిపారు. ప్రధాని నరేంద్ర మోదీ రాజ్యాంగ సిద్ధాంతాన్ని పాటించరని ఆరోపించారు. ఉత్తర్‌ప్రదేశ్ లఖ్‌నవూలో జరిగిన సంవిధాన్ సమ్మేళన్‌లో రాహుల్ ఈ మేరకు వ్యాఖ్యానించారు. "నిన్న పార్లమెంట్‌లో నేను ఎప్‌స్టీన్ అనే పదాన్ని ఉచ్ఛరించాను. దేశంలో గ్యాస్ సిలిండర్లు అందుబాటులో లేనందున ఈ సమస్య ఇంధన భద్రతకు సంబంధించినదని చెప్పాను. దేశ ఇంధన భద్రతలో మోదీ రాజీపడ్డారు. ఇంధన భద్రతలో ఎందుకు రాజీ పడ్డారు? అని కేంద్రాన్ని ప్రశ్నించాను. కేంద్ర పెట్రోలియం శాఖ మంత్రిగా హర్దీప్‌సింగ్ పూరీని నియమించారు. ఇది అమెరికాతో పడిన మొదటి రాజీ. ఎప్‌స్టీన్ ఫైల్స్‌లో పూరీ పేరు ఉంది. ఆయన ఎప్‌స్టీన్‌కు ఫ్రెండ్" అని రాహుల్ పేర్కొన్నారు.

**అమెరికా కోసం మోదీ పనిచేస్తున్నారు : రాహుల్ :** ప్రధాని నరేంద్ర మోదీ ఎప్‌స్టీన్, గౌతమ్ అదానీతో రాజీ పడడం వల్ల అమెరికాతో కుదిరిన వాణిజ్య ఒప్పందంలో భారత్ ప్రయోజనం పొందలేకపోయిందని రాహుల్ గాంధీ ఆరోపించారు. నరేంద్ర మోదీ ఇకపై భారతదేశ ప్రధాని కాదని, ఆయన అమెరికా కోసం పనిచేస్తున్నారని విమర్శించారు. తాను నిన్న (గురువారం) పార్లమెంట్‌లో నిజాలు మాట్లాడుతుంటే, మోదీ లోక్‌సభ నుంచి వెళ్లిపోయారని అన్నారు. "కాంగ్రెస్ పేదల పార్టీగా మారింది. అదే సమయంలో బీజేపీ మాత్రం ధనవంతుల పార్టీగా మారింది. బీజేపీ, మోదీ దేశ సంపద మొత్తాన్ని అదానీ చేతుల్లో పెట్టేశారు. అమెరికాలో దాఖలైన న్యాయపరమైన కేసు అదానీపై కాదు, బీజేపీపైనే. దీన్ని ఆసరాగా చేసుకుని వాణిజ్య ఒప్పందంపై అమెరికా భారత్‌పై ఒత్తిడి తెచ్చింది. ఫలితంగా మోదీ ఇప్పుడు అమెరికా కనుసన్నల్లో పనిచేస్తున్నారు. పార్లమెంటు నుంచి హఠాత్తుగా బయటకు వెళ్లి, మరెవరినీ సంప్రదించకుండానే కేవలం ట్రంప్‌తో ఫోన్‌లో మాట్లాడి మోదీ ట్రేడ్ డీల్‌ను ఖరారు చేశారు" అని రాహుల్ విమర్శించారు.

**'సిద్ధాంతాల విషయంలో కాన్షీరామ్ ఎప్పుడూ రాజీపడలేదు':** కాన్షీరామ్ తన సిద్ధాంతాల విషయంలో ఎప్పుడూ రాజీపడలేదని రాహుల్ గాంధీ తెలిపారు. ఒకవేళ ఆయన అలా చేసి ఉంటే ఆయన చిత్రపటం ఇక్కడ ఎప్పటికీ ప్రదర్శితమయ్యేది కాదన్నారు. ఈ రోజు కాన్షీరామ్ స్మరించుకుందామని అన్నారు. ఆయన పోరాటం, దార్శనికత దేశ రాజకీయాలపై ప్రభావం చూపిందన్నారు. మన ఆలోచనల కోసం పోరాడకపోతే ఏమీ సాధించలేమన్నారు. "ఈ ప్రసంగం చేసే ముందు బాబాసాహెబ్ అంబేడ్కర్ విద్య గురించి ఎలా మాట్లాడేవారో నేను ఆలోచిస్తున్నాను. ఆయన సంస్థాగత ప్రాముఖ్యత గురించి మాట్లాడారు. కాన్షీరామ్ రాత్రిపూట ఉత్తర్‌ప్రదేశ్ అంతటా తిరిగేవారు. ఆయన తనతో ఒక పెన్ను తీసుకెళ్లేవారు. సమాజంలోని 15 శాతం మంది కచ్చితంగా ప్రయోజనం పొందుతున్నప్పటికీ 85 శాతం మంది కూడా ప్రయోజనం పొందే విధంగా పెన్ను ఉండాలని అభిప్రాయపడేవారు. కానీ ఇప్పుడు ఏమి జరిగింది? బీజేపీ ఒక కొత్త వ్యవస్థను ప్రవేశపెట్టింది. బీజేపీ పెన్ను నుంచి దాని క్యాప్‌ను వేరు చేసింది. క్యాప్‌ను పక్కన పెట్టింది. ఇప్పుడు పెన్ను మాత్రమే పట్టుకుని తిరుగుతుంది. మాజీ ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ ఇప్పుడు జీవించి ఉంటే కాన్షీరామ్ కాంగ్రెస్ ముఖ్యమంత్రి అయి ఉండేవారు" అని రాహుల్ గాంధీ అభిప్రాయపడ్డారు.

# వ్యాయామం

వ్యాయామం చేయడం అనేది
స్వీయ నియంత్రణ వంటిది
వ్యాయామం వ్యక్తి యొక్క
సుగుణ సంపదను పెంచుతుంది
మనం చేసే ప్రతీ పనిలోను
ఉత్తమ ప్రతిభను చూపుతుంది.

మనిషి శరీర అవయవాలను
నడక ద్వారా, కాళ్ళు చేతులు
కదపడం ద్వారా వివిధ భంగిమలతో
వ్యాయామం చేయడం ద్వారా
అన్నిరకాల ఒత్తిడుల నుంచి
ఉపశమనం పొందడమే కాకుండా
కండరాల బిగుతును పోగొట్టి
సేదదీరడానికి దోహదపడతాయి
మనస్సు, శరీరం రెండింటికీ ఉన్న
పరస్పర సంబంధం మూలంగా
వ్యాయామం మనస్సుని సేదదీరుస్తుంది
ఈత కొట్టడం చాలా ఉత్తమమైన
శారీరక వ్యాయామంగా
పరిగణిస్తారు
ఇది చాలా ఆరోగ్యకరమైనది
వ్యాయామం అనేది మనిషికి
ప్రశాంతతను, ఆహ్లాదాన్ని
కలిగిస్తుంది.



**రచన : కె.మురళీమోహన్ రాజు**
**నెల్లూరు.**
**చరవాణి : 9866179385**

## సంయుక్త కలెక్టర్ ను సత్కరించిన మురళీమోహన్ రాజు



సావిత్రిబాయి పూలే ఎడ్యుకేషనల్ చారిటబుల్ ట్రస్టు మరియు అఖిల భారత అవయవ, శరీర దాతల సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం ఉదయం నెల్లూరు లోని జాయింట్ కలెక్టర్ ఛాంబర్ నందు సావిత్రిబాయి పూలే వర్ధంతి, మహిళా దినోత్సవం సందర్భంగా అఖిల భారత అవయవ, శరీర దాతల సంఘం ఆంధ్రప్రదేశ్ మరియు తెలంగాణ కోఆర్డినేటర్, రచయిత కె.మురళీమోహన్ రాజు, విశ్రాంత ఉపకార్మిక కమీషనర్ డాక్టర్ రాచపాలెం రఘు ఆత్మీయంగా సంయుక్త కలెక్టర్ మొగిలి వెంకటేశ్వర్లును ఆత్మీయంగా కలవడం జరిగింది. ఈసందర్భంగా సంయుక్త కలెక్టర్ మొగిలి వెంకటేశ్వర్లుకు ఆత్మీయ జ్ఞాపిక, శాలువాతో సత్కరించారు.

## గ్యాస్ కొరత ఉందని వస్తున్న వదంతులను ప్రజలు నమ్మవద్దని, జిల్లాలో గృహ వినియోగానికి అవసరమైన గ్యాస్ నిల్వలు సరిపడ ఉన్నాయని జిల్లా జాయింట్ కలెక్టర్ మొగిలి వెంకటేశ్వర్లు స్పష్టం

శుక్రవారం కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణంలో జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి లీలారాణి తో కలిసి గ్యాస్ సరఫరా సంస్థల ప్రతినిధులు, అధికారులతో జాయింట్ కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో గ్యాస్ సరఫరా వ్యవస్థను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నామని చెప్పారు. ప్రజలకు అవసరమైనంత ఎల్పిజి సిలిండర్లు అందుబాటులో ఉన్నాయని, సరఫరాలో ఎలాంటి అంతరాయం ఉండదని స్పష్టం చేశారు. ప్రతి గ్యాస్ ఏజెన్సీ వద్ద ఒక విఆర్ఓ ను, ఒక కానిస్టేబుల్ ను నియమించి గ్యాస్ డెలివరీ ని నిరంతరం పర్యవేక్షిస్తున్నట్లు చెప్పారు. డీలర్లు కూడా ప్రతిరోజు స్టాక్ వివరాలు, బుకింగ్ స్టేటస్, డెలివరీ స్టేటస్ మొదలైన వివరాలను ప్రభుత్వానికి అందించాలని సూచించారు. జిల్లాస్థాయిలో గ్యాస్ సిలిండర్ల అక్రమ రవాణా అరికట్టేందుకు, ప్రజలకు పారదర్శకంగా గ్యాస్ సిలిండర్లను అందేలా నిరంతర పర్యవేక్షణకు డివిజన్ స్థాయిలో ప్రత్యేక బృందాలను కూడా ఏర్పాటు చేసినట్లు చేసి వివరించారు. జిల్లాలో గ్యాస్ కొరతపై ప్రజలు ఎలాంటి అపోహలు పెట్టుకోకూడదని, వదంతులను ప్రజలు నమ్మవద్దని జాయింట్ కలెక్టర్ సూచించారు. ప్రతి వినియోగదారునికి అవసరమైన గ్యాస్ సిలిండర్లు సమయానికి



అందేలా ఆయిల్ కంపెనీలు, డిస్ట్రిబ్యూటర్లు చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశించారు. అక్రమ నిల్వలు, బ్లాక్ మార్కెట్ వంటి చర్యలు కనిపిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రజలు ఎలాంటి ఇబ్బందులు ఎదురైనా సంబంధిత గ్యాస్ ఏజెన్సీలు లేదా అధికారులకు తెలియజేయాలని సూచించారు. జిల్లాలో గ్యాస్ సరఫరా పూర్తిగా సాధారణంగా కొనసాగుతోందని, అందరికీ గ్యాస్ సిలిండర్లు అందేలా చర్యలు తీసుకుంటున్నామని జాయింట్ కలెక్టర్ తెలిపారు. ఈ సమావేశంలో హెచ్ పి, భారత్, ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ల గ్యాస్ ఏజెన్సీల డీలర్లు, పౌరసరఫరాల శాఖ అధికారులు పాల్గొన్నారు..

## మేలు జాతి దూడలతో పశుపోషణ లాభదాయకం”

**విజ్ఞాన్ పత్రిక మణికుమార్ కారంపూడి మార్చి :14 )** కారంపూడి మండలం, వేపకంపల్లి గ్రామంలో శుక్రవారం మేలు జాతి లేగ దూడల ప్రదర్శన నిర్వహించారు.రాష్ట్ర పశుగణాభివృద్ధి సంస్థ, పశు సంవర్ధక శాఖ సంయుక్త ఆధ్వర్యంలో రాష్ట్రీయ గోకుల్ మిషన్ పథకం అమలులో భాగంగా మేలు జాతి లేగదూడల ప్రదర్శన ఏర్పాటు చేశారు. కారంపూడి మండల ఇంచార్జ్ పశు వైద్యాదికారి డాక్టర్. డి. దిలీప్, డాక్టర్ వి, శ్రీనివాసరెడ్డి పిడుగురాళ్ల మండలం , డాక్టర్ వెంకటేశ్వర్లు మాచవరం మండలం ,పాల్గొని ప్రదర్శన ప్రారంభించారు.డాక్టర్. డి.దిలీప్ మాట్లాడుతూ పాడిని కేవలం ఒక ఆదాయ వనరుగా చూడటమే కాకుండా లేగదూడాల పోషణను తగు జాగ్రత్తలు పాటిస్తే మంచి పాడిపోషణ సాధ్య పడుతుందని చెప్పారు.గేదె జాతి పశువుల పునరుత్పత్తి చలికాలం అనుకూలమైనది అని వివరించారు.రైతులు, పశువుల్లో ఎద లక్షణాలు గమనించి వేసవి కాలానికి ముందే కృత్రిమ గర్భోత్పత్తి చేయించడం వలన పశుపోషణ మరింత వృద్ధి చెందుతుందని, లాభదాయకంగా ఉంటుందని తెలిపారు.కార్యక్రమం లో పాల్గొన్న దూడలకు నట్టల నివారణ మందులు పైపరజైన్ తాపించారు .దూడల యొక్క మరణాల శాతం తగ్గించడం,



పెయ్యాదూడలు పుట్టేందుకు గాూ సెమెన్ గురించి తెలిపారు. దూడలలో తెల్ల వీరేచనలు కాకుండా ముందు నుంచే జాగ్రత్త వహించాలని తెలియపరిచారు.ఈ ప్రదర్శన లో 35 మంది రైతులు పాల్గొని 42 దూడలను ప్రదర్శించారు.ప్రదర్శన లో పాల్గొన్న పశు పోషకులకు ప్రోత్సాహక బహుమతులు, మినరల్ మిక్సర్, లివర్ టానిక్ లు అందచేశారు.ఈ కార్యక్రమం లో ముఖ్య అతిథులు గా టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పంగులూరి అంజయ్య, కారంపూడి మండల ఎంపీపీ బోల్నేడి కనకదుర్గ శ్రీనివాసరావు, కారంపూడి టీడీపీ పార్టీ అధ్యక్షుడు గొల్ల సురేష్,, పశు వైద్య సిబ్బంది, పాడి రైతులు పాల్గొని ఈ కార్యక్రమాన్ని ఘనంగా విజయవంతం చేశారు.

## టెన్త్ పరీక్షలకు సర్వసిద్ధం : ఎంఈఓ రవి కుమార్‌లి

**- ఎగ్జామ్ సెంటర్ కి అరగంట ముందే చేరుకోవాలి లి**

**విజ్ఞాన్ పత్రిక మణికుమార్ కారంపూడి మార్చి :14** ఈ నెల 16వ తేదీ నుంచి జరగనున్న 10వ తరగతి పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తిచేసినట్లు ఎంఈఓ రవి కుమార్ అన్నారు. శుక్రవారం కారంపూడిలోని తమ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ మండలం మొత్తం 654 మంది విద్యార్థులు పదవ తరగతి పరీక్షలకు హాజరవుతున్నట్టు తెలిపారు. విద్యార్థులు పదవ తరగతి పరీక్షలు రాసేందుకు కారంపూడిలోని మూడు కేంద్రాలు సెంటర్ నెంబర్55067 బ్రహ్మనాయుడు జిల్లా పరిషత్ హై స్కూల్ 211 విద్యార్థులు సెంటర్ నెంబర్55070 ఏపీ మోడల్ స్కూల్ 240 విద్యార్థులు సెంటర్ నెంబర్55071 సెయింట్ జాన్స్ ఇంగ్లీష్ మీడియం హై స్కూల్ 203 మంది విద్యార్థులు ను పదవ తరగతి విద్యార్థులు పరీక్ష రాసేందుకు కేటాయించింది. ఏ ప్రభుత్వం ప్రవేటు విద్యా సంస్థలు విద్యార్థులకు హాల్ టికెట్ నిరాకరిస్తే వారిపైన చట్టం పరమైన చర్యలు తీసుకోబడును. పరీక్ష రాసే సమయంలో విద్యార్థులకు



ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కొనకుండా ఉండేందుకు 100 మీటర్ల వరకు పరీక్షాకేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుందని చెప్పారు. అలాగే పరీక్షకేంద్రాలు వద్ద పరీక్షలు ముగిసే అంతవరకు జిరాక్స్ షాపులు తీసివేయాలని తెలియజేశారు. ఎగ్జామ్స్ సెంటర్ కు వచ్చే ఇన్విజిలేటర్స్ కు మొబైల్ అనుమతి లేదు అని తెలిపారు. ప్రతి ఎగ్జామ్స్ సెంటర్ వద్ద ఉచితంగా మెడికల్ సెంటర్ ను కూడా ఏర్పాటు చేయడం జరుగుతుందని తెలిపారు. గాూజ2026 పరీక్షలకు సంబంధించిన ఎలాంటి ఇబ్బందులు ఉన్న మండల విద్యాశాఖ అధికారిని సంప్రదించవచ్చు.

## తెలుగు మహిళా కవయిత్రి ఆతుకూరి మొల్లమాంబ అందరికీ ఆదర్శం

**-బీసీ ఐక్యత భవన్ అధ్యక్షుడు అద్దంకి ప్రభాకర్**



**నెల్లూరు విజ్ఞాన్ పత్రిక రిపోర్టర్ :** కావలి పెద్దపవని రోడ్ వైకుంఠపురం సెంటర్ లో కావలి నియోజకవర్గ ఆంధ్రప్రదేశ్ కుమ్మర యువసేన ఆధ్వర్యంలో కుమ్మర ఆడపడుచు, తొలి తెలుగు మహిళా కవయిత్రి ఆతుకూరి మొల్లమాంబ జయంతి కార్యక్రమం అట్టహాసం జరిగింది. ఈ సందర్భంగా బీసీ ఐక్యత భవన్ రాష్ట్ర అధ్యక్షుడు అద్దంకి ప్రభాకర్ మాట్లాడుతూ ఆతుకూరి మొల్లమాంబ గారు రామాయణాన్ని సంస్కృతం నుండి తెలుగులోకి అనువదించిన గొప్ప రచయిత్రి అని కొనియాడారు, అలాగే రాబోయే రోజులలో కావలి పట్టణంలో కవయిత్రి మొల్లమాంబ గారి విగ్రహం అందరి సహకారంతో ఏర్పాటు చేస్తాము అని తెలియజేశారు. కవయిత్రి మొల్లమాంబ జయంతి వేడుకలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అధికారికంగా నిర్వహించడం ఎంతో సంతోషకరమని తెలియజేశారు.

**అట్టహాసంగా పెద్దపవని రోడ్ వైకుంఠపురం సెంటర్ లో కావలి నియోజకవర్గ ఆంధ్రప్రదేశ్ కుమ్మర యువసేన ఆధ్వర్యంలో కుమ్మర ఆడపడుచు, తొలి తెలుగు మహిళా కవయిత్రి**



**కావలి : విజ్ఞాన్ దినపత్రిక న్యూస్** . ఈ సందర్భంగా కుమ్మర యువసేన నియోజకవర్గ అధ్యక్షుడు బెజవాడ అభిసాగర్ ప్రజాపతి మాట్లాడుతూ ఆతుకూరి మొల్లమాంబ రామాయణాన్ని సంస్కృతం నుండి తెలుగులోకి అనువదించిన గొప్ప రచయిత్రి అని కొనియాడారు, అలాగే రాబోయే రోజులలో కావలి పట్టణంలో కవయిత్రి మొల్లమాంబ విగ్రహం అందరి సహకారంతో ఏర్పాటు చేస్తాము అని తెలియజేశారు. కుమ్మర యువసేన నాయకుడు మన్నేపల్లి రుషికేశ్ ప్రజాపతి మాట్లాడుతూ కవయిత్రి మొల్లమాంబ జయంతి వేడుకలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అధికారికంగా నిర్వహించడం ఎంతో సంతోషకరమని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ల గుడ్లూరి మాల్యాద్రి ప్రజాపతి, యేగూరి చిన్నపుల్లయ్య ప్రజాపతి, కుమ్మర సంఘం నాయకులు బెజవాడ రవీంద్ర ప్రజాపతి,పొన్నగంటి మురళి ప్రజాపతి, బెజవాడ ప్రసన్న కుమార్ ప్రజాపతి, వేణు ప్రజాపతి,పత్తిపాటి వేదనాథ్ ప్రజాపతి,దిలీప్ కుమార్ ప్రజాపతి,బీసీ నాయకులు ద్రోణాదుల వెంకట్రావు, అద్దంకి ప్రభాకర్,న్యాయవాదులు ఎన్. భారత్ రాయల్, గుంజి నరేష్ మరియు బీజేపీ ఓబీసీ జిల్లా అధ్యక్షుడు మామిడి వెంకటేశ్వర్లు, రాష్ట్ర నాయకులు గుండ్లపల్లి భరత్ కుమార్,బ్రహ్మానందం, కుమార్ గౌడ్, మంద కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

## రైతన్నలకు ఉగాది కానుకగా పీఎం కిసాన్ - అన్నదాత సుఖీభవ

- ఇందుకూరుపేట డేవీస్ పేటలో విన్నూత్నంగా పంట పొలాలలో పీఎం కిసాన్ - అన్నదాత సుఖీభవ కార్యక్రమ నిర్వహణ.
- ఎమ్మెల్యే ప్రశాంతమ్మకు వరి కంకులు, టెంకాయ మాలలతో ఘన సన్మానం.
- కోవూరు నియోజకవర్గ రైతుల ఖాతాల్లోకి రూ.9.3 కోట్లు 3 వ విడత పీఎం కిసాన్ - అన్నదాత సుఖీభవ నిధులు
- కోవూరు నియోజకవర్గంలో 16 వేల 938 రైతులకు 3 విడతలుగా మొత్తం 31 కోట్ల 32 లక్షల రూపాయలు లబ్ధి.
- ఎన్నికలలో ఇచ్చిన హామీ మేరకు ల్యాండ్ యాక్ట్ రద్దు చేశాం.
- ప్రభుత్వ రాజముద్ర ముద్రించిన పట్టాదారు పాసు పుస్తకాలు అందించింది కూటమి ప్రభుత్వం.
- 41 ధాన్య కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి, క్వింటాకు.2 వేల 389 చొప్పున మద్దతు ధర కల్పిస్తున్నాం.

**కోవూరు - ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి**

**కోవూరు /ఇందుకూరు పేట /మార్చి విజ్ఞాన్ )** రైతు సంక్షేమమే రాష్ట సంక్షేమమని కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి అన్నారు. పిఎం కిసాన్ – అన్నదాత సుఖీభవ 3వ విడత నిధుల విడుదల సందర్భంగా ఇందుకూరు పేట మండలం డేవీస్ పేట మండలంలో ఏర్పాటు కార్యక్రమంలో పాల్గొన్న ఆమెకు స్థానిక రైతులు ఘన స్వాగతం పలికారు. వరి కంకులు, టెంకాయ మాలలతో ఘన సన్మానం చేసి తమ అభిమానం చాటుకున్నారు. పీఎం కిసాన్ – అన్నదాత సుఖీభవ పథకం నిధుల విడుదల సందర్భంగా రైతులతో కలిసి ప్రధాని నరేంద్ర నరేంద్ర మోడీ నరేంద్ర మోడీ, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రసంగాలను వీక్షించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రశాంతమ్మ మహిళా రైతులతో ముఖాముఖి మాట్లాడుతూ వారు పండించిన వ్యవసాయ ఉత్పత్తులను పరిశీలించి సాగులో కష్టసుఖాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా రాష్ట వ్యాప్తంగా 46 లక్షల మంది రైతుల ఖాతాల్లో 2 వేల 675 కోట్ల రూపాయలు రైతుల ఖాతాల్లో జమ చేసిన ప్రధానమంత్రి నరేంద్ర మోడీ సీఎం చంద్రబాబుకుధన్యవాదాలుతెలియచేసారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ, కోవూరు నియోజకవర్గ వ్యాప్తంగా 16 వేల 938 మంది రైతులకు 9 కోట్ల 30 కోట్ల పెట్టుబడి సాయం అందిస్తున్నామన్నారు. గత రెండేళ్ల కూటమి పాలనలో 3 విడతలుగా మొత్తం 31 కోట్ల 32 లక్షల రూపాయలు లబ్ధి చేకూరిందని ఆమె వెల్లడించారు. కోవూరు నియోజకవర్గంలో రైతుల కోసం 41 ధాన్య కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి క్వింటాకు రూ. 2,389 మద్దతు ధర కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. నెల్లూరు కోనసీమగా పేరుగాంచిన ఇందుకూరుపేట మండలంలో 800 ఎకరాల్లో అరటి, 1400 ఎకరాల్లో కొబ్బరి సాగు అవుతోందని.. అరటికి హెక్టారుకు 42 వేలు కొబ్బరికి .53 వేల సబ్సిడీ అందిస్తున్నామని ఆమె పేర్కొన్నారు. ఆకుకూరలు, కూరగాయల సాగుకు హెక్టారుకు 24 వేలు, కోకో సాగుకు 30 వేల రాయితీతో పాటు, ఆయిల్ పామ్ రైతులకు ఉచిత మొక్కలు అందచేయడంతో నాలుగేళ్ల పాటు ఏటా 10 వేల 500 పెట్టుబడి సాయం అందిస్తున్నట్లు ఆమె వివరించారు. వ్యవసాయ యంత్రీకరణలో భాగంగా 50 శాతం సబ్సిడీతో స్ప్రేయర్లు, పవర్ టిల్లర్లు అందిస్తూనే.. మినీ ట్రాక్టర్ల కొనుగోలుపై సామాన్య రైతులకు 1 లక్షా 96 లక్షలు, ఎస్సీ మహిళా రైతులకు ఏకంగా 2 లక్షల 40 వేలభారీ సబ్సిడీని ప్రభుత్వం అందజేస్తోందని ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి స్పష్టం చేశారు. కూటమి ప్రభుత్వం అధికారం లోనికి వచ్చాక ల్యాండ్ యాక్ట్ రద్దు చేసి ప్రభుత్వ



రాజముద్రతో రైతులకు పాస్ పుస్తకాల అనడిచేసిన విషయాన్ని ఆమె ఈ సందర్భంగా గుర్తు చేశారు. గత రబీ సీజన్ లో ధాన్య సేకరణ సందర్భంగా 48 గంటలలో రైతుల ఖాతాలలో డబ్బులు జమ అయిన విషయాన్ని గుర్తు చేస్తూ నేడు సైతం అధికారులు, మిల్లర్లు అదే స్ఫూర్తితో పని చేస్తున్నారని తెలిపారు. కూటమి ప్రభుత్వ పాలనలో రైతులు సంతోషంగా వున్నారని రైతు బాగుంటుంటేనే రాష్టం సుభిక్షంగా వుంటుందన్న ఏకైక లక్ష్యంగా సీఎం,చంద్రబాబు నాయుడు జనరంజక పాలన అందిస్తున్నారని ఆమె కొనియాడారు. ఈ సందర్భంగా రైతులకు భూసార పరీక్ష పత్రాలను ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి అందజేశారు. ఈ కార్యక్రమంలో ఈ కార్యక్రమంలో నియోజకవర్గ వ్యవసాయ అధికకారిని అనిత, కోవూరు, బుచ్చి కోవూరు కొడవలూరు మండలాల వ్యవసాయ అధికారులు శ్రీహరి, విజయలక్ష్మి, రజని, హార్టికల్చర్ అధికారి ప్రసన్న కుమారి లతో పాటు పెద్ద సంఖ్యలో రైతులు తెలుగుదేశం మరియు కూటమి పార్టీల ముఖ్య నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## రైతు సంక్షేమమే కూటమి ప్రభుత్వం ధ్యేయం

**- ఇచ్చిన హామీ మేరకు రైతులకు 20 వేల పెట్టుబడి భరోసా**
**- పీఎం కిసాన్ -- అన్నదాత సుఖీభవ మూడవ విడత నిధుల విడుదలతో రైతుల ముఖాల్లో సంతోషం**
**- ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి**



రాష్ట్రంలో రైతుల సంక్షేమమే ప్రధాన ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పాలన సాగిస్తోందని నెల్లూరు పార్లమెంటు సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి అన్నారు. శుక్రవారం పీఎం కిసాన్ – అన్నదాత సుఖీభవ మూడవ విడత నిధుల విడుదల సందర్భంగా జిల్లా రైతుల తరఫున ఆయన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు ఓ ప్రకటనలో ధన్యవాదాలు తెలియజేశారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ గారు, సీఎం చంద్రబాబు నాయుడు గారి సారథ్యంలో రైతులకు లబ్ధి చేకూరుతోందని పేర్కొన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు రైతులకు 20 వేలు ఆర్థిక సహాయం చేయడం కూటమి ప్రభుత్వానికే సాధ్యం అన్నారు. రాష్టంలోని 46.85 లక్షల మంది రైతుల ఖాతాల్లో 2675 కోట్లు జమ చేసి రైతు పక్షపాత ప్రభుత్వమని తెలియజేశారున్నారు. నెల్లూరు జిల్లా పరిధిలో 1 లక్ష 95 వేల మందికి 111 కోట్లు వారు బ్యాంక్ ఖాతాల్లోకి నేరుగా జమ కావడం వల్ల వ్యవసాయ కార్యకలాపాలకు అవసరమైన పెట్టుబడులను సమకూర్చుకునే అవకాశం కలిగిందని ఎంపీ పేర్కొన్నారు. రైతుల జీవితాల్లో సంతోషం, స్థిరత్వం తీసుకురావడమే ప్రభుత్వ లక్ష్యమని ఆయన పేర్కొన్నారు. మూడవ విడత నిధుల విడుదలతో రైతులకు మరింత ఆర్థిక భరోసా లభిస్తుందని, రైతాంగం అభివృద్ధి చెందితేనే దేశం అభివృద్ధి చెందుతుందని చెప్పారు.

## గూడూరు పట్టణం:- అన్నదాత సుఖీభవ -పీఎం కిసాన్ 3వ విడత విడుదల కార్యక్రమం లో భాగంగా షాది మంజిల్ నందు రైతులతో సమావేశం లో పాల్గొన్న శాసన సభ్యులు డాక్టర్ పాశం సునీల్ కుమార్



నియోజకవర్గం లో అన్నదాత సుఖీభవ ద్వారా 22 వేల 217 కుటుంభాలకు 12 కోట్ల 54 లక్షల 94 వేల రూపాయలు అందిస్తున్నాం అన్నారు. కూటమి ప్రభుత్వం చెప్పిన విధంగా సూపర్ 6 పథకాలలో ఒక్కోటి అమలు చేస్తుంది. అన్నదాత సుఖీభవ పథకం కింద రైతుకు 20 వేలు అందిస్తామని చెప్పాము. మొదటి విడత లో భాగంగా 7000 వేల రూపాయలు ప్రతి రైతు ఖాతాలో జమ చేసాం. రెండో విడత లో భాగంగా రాష్ట్ర ప్రభుతం 5000 వేలు, కేంద్ర ప్రభుత్వం 2000 వేలు రూపాయలు జమ చేసాం. ఈ రోజు 3వ విడత లో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం 4000 వేలు, కేంద్ర ప్రభుత్వం 2000 వేల రూపాయలు వేస్తుంది అన్నారు. గూడూరు మండలం లో 5188 మందికి గాను 2 కోట్ల 86 లక్షలు అందిస్తున్నాం చిల్లకూరు మండలం లో 4591 మందికి గాను 2 కోట్ల 62 లక్షలు అందిస్తున్నాం కోట మండలం లో 3745 మందికి గాను 2 కోట్ల 12 లక్షలు అందిస్తున్నాం వాకాడు మండలంలో 3795 మందికి గాను 2 కోట్ల 11 లక్షలు అందిస్తున్నాం చిట్టమూరు మండలం లో 4898 మందికి గాను 2 కోట్ల 84 లక్షలు అందిస్తున్నాం మొత్తం నియోజకవర్గం నందు 22217 కుటుంబాలకు గాను 12 కోట్ల 54 లక్షల 94 వేలు అందిస్తున్నాం అని అన్నారు. చెప్పున మాట ప్రకారం ఒక్కో పథకం అమలు చేస్తున్నాం అన్నారు. గత ప్రభుత్వం లాగ మాది మాటల ప్రభుత్వం కాదు, చేతల ప్రభుత్వం అని అన్నారు. నియోజకవర్గంలో 38 లక్షల 25 వేల రూపాయల సబ్సిడీతో 226 వ్యవసాయ పనిముట్లను అందించాము. 24 లక్షల 50 వేల రూపాయల సబ్సిడీతో 5 డ్రోన్ లను అందించాము. నియోజకవర్గంలో 61896 ఎకరాల సాగుకు 12404 టన్నుల యూరియాను అందించామని అన్నారు. దిత్వా తుఫాను కారణంగా నియోజకవర్గంలో దెబ్బతిన్న రైతులకు 80% సబ్సిడీతొ 4343 రైతులకు 3 టన్నుల వరి విత్తనాలను అందించామని అన్నారు.

# అన్నదాత సుఖీభవ తో రైతులకు మేలు

**-ఏ పి ఈ ఏం సి ఎల్ చైర్మెన్ పోలం రెడ్డి దినేష్ రెడ్డి**



**కోవూరు /తంబల్లపల్లి /విజ్ఞాన్ ).** అన్నధాత సుఖీభవ పథకం రైతులుకు ఎంతో మేలని తశీ బల్లపల్లి నియోజకవర్గం పరిశీలకులు పోలం రెడ్డి దినేష్ రెడ్డి అన్నారు. బి. కొత్తకోట మండలం కాండ్లమడుగు గ్రామం నారాయణస్వామి కళ్యాణమండపంలో నిర్వహించిన "అన్నదాత సుఖీభవ -- పీఎం కిసాన్ పథకం" కార్యక్రమం విజయవంతంఈ సందర్భంగా భారత ప్రధాన మంత్రినరేంద్ర మోదీ మరియు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రైతుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని శుక్రవారం రైతుల బ్యాంకు ఖాతాల్లో ఆర్థిక సహాయాన్ని నేరుగా జమ చేయడం రైతులకు ఎంతో ఉపశమనం కలిగించేవిషయంఅనిఅన్నారు. రాజంపేట పార్లమెంట్ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు సుగువాసి ప్రసాద్ బాబు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం పాలనలో రైతులకు మెరు గైన పథకం లు ఇవ్వడములో సీఎం చంద్రబాబు కృషి గొప్పదని అన్నారు అలాగే స్థానిక నాయకులు, రైతులు, వ్యవసాయ శాఖ అధికారులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. ఈ సందర్భంగా రైతులతో మాట్లాడి ఆధునిక వ్యవసాయ పద్ధతులు గురించి అవగాహన కల్పించారు . ముఖ్యంగా హార్టికల్చర్ పంటలు, డ్రిప్ ఇరిగేషన్ విధానం మరియు వ్యవసాయ డ్రోన్ల వినియోగం గురించి తెలియజేశారు హార్టికల్చర్ పంటల సాగులో డ్రిప్ ఇరిగేషన్ ఉపయోగించడం ద్వారా తక్కువ నీటితో ఎక్కువ దిగుబడి సాధించవచ్చు. మొక్కలకు అవసరమైన నీరు మరియు ఎరువులు నేరుగా వేర్లకు చేరడం వల్ల పంటల వృద్ధి మెరుగుపడుతుంది మరియు నీటి వినియోగం కూడా తగ్గుతుంది. అలాగే వ్యవసాయ డ్రోన్లు ఉపయోగించడం ద్వారా పంటలపై ఎరువులు మరియుపురుగుమందులను సమానంగా పిచికారీ చేయవచ్చు. తక్కువ సమయంలో ఎక్కువ విస్తీర్ణంలో పని చేయడం వల్ల రైతుల శ్రమ మరియు ఖర్చు తగ్గి, వ్యవసాయం మరింత సులభంగా మారుతుందిప్రభుత్వం అందిస్తున్న పథకాలు మరియు ఆధునిక సాంకేతికతలను రైతులు సద్వినియోగం చేసుకుని వ్యవసాయాన్ని మరింత లాభదాయకంగా మార్చుకోవాలని ఈ సందర్భంగా కోరుకుంటున్నాను. ఈ కార్యక్రమంలో తంబల్లపల్లి నియోజకవర్గ నాయకులు రైతులు కూటమి నాయకులు పాల్గొన్నారు

# సియం చంద్రబాబు రైతుల పక్షపాతి.

**- ఒక రైతు బిడ్డగా కావలి నియోజకవర్గంలో ప్రతి రైతుకు అండగా ఉంటా ఎమ్మెల్యే కావ్య క్రిష్ణారెడ్డి**



**కావలి : విజ్ఞాన్ దినపత్రిక న్యూస్** రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రైతుల పక్షపాతి అని కావలి ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డి అన్నారు. శుక్రవారం నెల్లూరు జిల్లా,కావలి పట్టణం కలయిక కళ్యాణ మండపంలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో 3 వ విడత అన్నదాత సుఖీభవ, 22 వ విడత పి. యం కిసాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమనికి ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డి హాజరయ్యారు. ఈ సందర్బంగా ఎమ్మెల్యే కావలి నియోజకవర్గంలో ని నాలుగు మండలాలకు రూ. 10,14 కోట్ల రూపాయలు చెక్కును ఆవిష్కరించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ కావలి నియోజకవర్గం లోని నాలుగు మండలాలకు పీఎం కిసాన్, అన్నదాత సుఖీభవ పథకం ద్వారా రూ. 10,14 కోట్లు రైతుల ఖాతాలో ఈరోజు జమ చేస్తున్నామన్నారు. నాలుగు మండలాలలో అన్నదాత సుఖీభవ రైతులు 18,305,, పీఎం కిసాన్ రైతులు 14,029 కి వున్నారన్నారు. కేంద్రంలో నరేంద్ర మోడీ,, రాష్టంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు,ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, యువ నేత లోకేష్ బాబు సంపూర్ణ మైన పాలనను అందిస్తున్నారు అన్నారు. ైతులకు సబ్సిడీ తో విత్తనాలు,ట్రాక్టర్ లు, వ్యవసాయ పనిముట్లు, ఎరువులు ఇవ్వడంతో పాటు అన్నదాత సుఖీభవ ద్వారా ఇప్పటికి రూ. 20 వేలు ఇవ్వడం జరిగిందన్నారు.. కావలి నియోజకవర్గంలో ప్రతి రైతుకు అండగా ఉంటానని ఎమ్మెల్యే తెలిపారు.. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ అధికారులు, రైతులు,కూటమి నాయకులు పాల్గొన్నారు.

# మత సామరస్యానికి ప్రతీక ఇఫ్తార్ విందు లో - డాక్టర్ అర్జున్ రెడ్డి



**కోవూరు /బుచ్చి /విజ్ఞాన్ )** రంజాన్ మాసం క్రమశిక్షణ, సహనం, సేవా భావానికి నిదర్శనమని కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి తనయులు డాక్టర్ అర్జున్ రెడ్డి అన్నారు కోవూరునియోజకవర్గంలోనిబుచ్చిరెడ్డిపాలెం మరియు కోవూరు పట్టణాలలో నిర్వహించిన ఇఫ్తార్ విందులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్న డాక్టర్ అర్జున్ రెడ్డి కీ స్థానిక మైనారిటీ నాయకులు ఘన స్వాగతం పలికారు. ఈసందర్భంగా ఆయన ముస్లిం సోదరులతో కలిసి ఉపవాసదీక్షనువిరమించారు. అనంతరం మసీదులో సేవ చేసే మౌజన్ మరియు విపిఆర్ ఫౌండేషన్ తరఫున రంజాన్ తోఫా కిట్లు అందజేశారు. ఈసందర్భంగా డాక్టర్ అర్జున్ రెడ్డి మాట్లాడుతూ.. పవిత్ర రంజాన్ మాసంలో అందరం కలిసి ఇఫ్తార్ విందులో పాల్గొనడం సంతోషంగా ఉందన్నారు. ఉపవాసాల ద్వారా ఆకలి విలువను తెలుసుకుంటూ తోటి వారికి సహాయం చేయాలనే గొప్ప సందేశాన్ని ఈ పండుగ మనకు అందిస్తుందని చెప్పారు. కులమతాలకు అతీతంగా అందరూఒకేచోటచేరడం మతసామరస్యం మరియు సోదరభావానికి నిదర్శనమని ఆయన కొనియాడారు. ?మైనారిటీల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని ?ముస్లిం మైనారిటీల అభివృద్ధిపై కూటమి ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధిని ఆయన ఈ సందర్భంగా వివరించారు. 2025-26 ఆర్థిక సంవత్సరానికి గాను మైనారిటీల సంక్షేమం కోసం ప్రభుత్వం భారీగా 5 వేల 434 కోట్ల రూపాయలుకేటాయించిందని తెలిపారు. ?మసీదుల్లో సేవలు అందిస్తున్న ఇమామ్‌లకు నెలకు 10వేలరూపాయలు, మౌజన్‌లకు 5 వేల రూపాయల చొప్పున గౌరవ వేతనాలను అందిస్తున్నట్లు డాక్టర్ అర్జున్ రెడ్డి పేర్కొన్నారు. ముస్లిం యువత సెల్ఫ్ ఎంప్లాయిమెంట్ కోసం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు 173కోట్ల57లక్షలరూపాయలు కేటాయించారని దీని ద్వారా అనేక కుటుంబాలకు మేలు జరుగుతుందని ఆయన వెల్లడించారు. ?ఈకార్యక్రమాలలో ముస్లిం మత పెద్దలు, తెలుగుదేశం పార్టీ నాయకులు, కూటమి నాయకులు కార్యకర్తలు తదితరులు ఉన్నారు.

# మహిళా శక్తి గొప్పది

**-స్వచ్ఛందా సేవా సంస్థ కో ఆర్డినేటర్ బాబు**




**కోవూరు /విడవలూరు /మార్చి విజ్ఞాన్ )** మహిళలో సృజనత్మకత శక్తి ఎంతో గొప్పదని ఆర్ ఆర్ ఆర్ ఏడ్యూ కేషనల్ సొసైటీసంస్థ కో ఆర్డినేటర్ బాబు అన్నారు .,ఆర్ ఆర్ ఆర్, ఏడ్యుకేషన్ సొసైటీ నెల్లూరు ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్ వాలంటరీ హెల్త్ అసోసియేషన్ సహకారంతో శనివారం విడవలూరు మండలంలోని రామతీర్థం జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాలలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలను శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు బాలకృష్ణ మాట్లాడుతూ బాలికలు, మహిళలు, పురుషులతో సమానంగా అన్ని హక్కులు కలిగి ఉన్నారని పేర్కొన్నారు. మహిళలకు ఆస్తిలో సమాన హక్కుతో పాటు రాజకీయంగా కూడా స్థానిక సంస్థల్లో 33% రిజర్వేషన్ ఉందని త్వరలోనే అసెంబ్లీ పార్లమెంట్ ఎన్నికల్లో కూడా మహిళలకు 33% రిజర్వేషన్ అమలు కామన్దని తెలిపారు విద్యార్థినిలు కష్టపడి చదువుకోవాలని తద్వారా ప్రభుత్వం ప్రత్యేకంగా మహిళ కోసం కల్పించిన 33 శాతం రిజర్వేషన్ను వినియోగించుకొని ఉన్నత విద్యాభ్యాసంతో పాటు ఉన్నత ఉద్యోగాలు ఉండేందుకు కృషి చేయాలనిసూచించారు. స్వచ్ఛంద సంస్థ కోఆర్డినేటర్, కే బాబు మాట్లాడుతూ మహిళలకు తమ సంస్థ అన్ని విధాల అండగా ఉంటుందని ప్రత్యేకంగా విద్యార్థినుల పట్ల తమ సంస్థ ద్వారా అనేక కార్యక్రమాలు చేపడుతున్నామని తెలిపారు ఈ కార్యక్రమంలో పాఠశాల విద్యార్థిని విద్యార్థులతో పాటు ఉపాధ్యాయులు మహేష్,వెంకటేశ్వర్లు, విష్ణు తదితరులు ఉన్నారు.

# రైతన్నల సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయం...!

**-అన్నదాత సుఖీభవ పథకం కింద ఒక్కో రైతు ఖాతాలో రూ. 6000లు జమ చేస్తున్న సీఎం చంద్రబాబు**
**-ఇప్పటికే గత రెండు విడతల్లో రూ.6,309 కోట్లు జమ**
**-మూడో విడతగా నేడు రూ.2,675.97 కోట్లు విడుదల**
**-రాష్ట్రంలోని 46,85,838 మంది రైతులకు లబ్ధి.**
**-ఇచ్చిన హామీ మేరకు రైతులకు 20 వేల పెట్టుబడి భరోసా**
**-పీఎం కిసాన్ -- అన్నదాత సుఖీభవ మూడవ విడత నిధుల విడుదలతో రైతన్న ముఖాలలో సంతోషం..**



ఉదయగిరి మార్చి 13 న రాష్ట్రంలో రైతుల సంక్షేమమే ప్రధాన ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పాలన సాగిస్తోందని ఉదయగిరి శాసనసభ్యులు కాకర్ల సురేష్ అన్నారు. శుక్రవారం పీఎం కిసాన్ - అన్నదాత సుఖీభవ మూడవ విడత నిధుల విడుదల సందర్భంగా ఉదయగిరి నియోజకవర్గ రైతుల తరఫున ఆయన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు ఓ ప్రకటనలో ధన్యవాదాలు తెలియజేశారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ , సీఎం చంద్రబాబు నాయుడు సారథ్యంలో రైతులకు లబ్ధి చేకూరుతోందని పేర్కొన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు రైతులకు 20 వేలు ఆర్థిక సహాయం చేయడం కూటమి ప్రభుత్వానికే సాధ్యం అన్నారు. రాష్ట్రంలోని 46.85 లక్షల మంది రైతుల ఖాతాల్లో 2675 కోట్లు జమ చేసి రైతు పక్షపాత ప్రభుత్వమని తెలియజేశారున్నారు. ఉదయగిరి నియోజకవర్గ పరిధిలో 45 వేల మందికి 25 కోట్లును వారు బ్యాంక్ ఖాతాల్లోకి నేరుగా జమ కావడం వల్ల వ్యవసాయ కార్యకలాపాలకు అవసరమైన పెట్టుబడులను సమకూర్చుకునే అవకాశం కలిగిందని ఎమ్మెల్యే కాకర్ల పేర్కొన్నారు. రైతుల జీవితాల్లో సంతోషం, స్థిరత్వం తీసుకురావడమే ప్రభుత్వ లక్ష్యమని ఆయన పేర్కొన్నారు. మూడవ విడత నిధుల విడుదలతో రైతులకు మరింత ఆర్థిక భరోసా లభిస్తుందని, రైతాంగం అభివృద్ధి చెందితేనే దేశం అభివృద్ధి చెందుతుందని అన్నారు.

## జిల్లా మునిసిపల్ విభాగం వైసీపీ అధ్యక్షులు గా షకీలా బేగం నియామకం పట్ల పలువురు హర్షం.



**కోవూరు /బుచ్చి /మార్చి విజ్ఞాన్ )** నెల్లూరు జిల్లా వై. యస్. ఆర్ కాంగ్రెస్ పార్టీ మునిసిపల్ విభాగం అధ్యక్షులుగా ఉన్న ఇప్పగుంట విజయభాస్కర్ రెడ్డి ని తొలగిస్తూ ఆ స్థానంలో బుచ్చిరెడ్డిపాళెం మునిసిపాలిటీ 7వ వార్డు కౌన్సిలర్ షేక్ షకీలా బేగం ని నెల్లూరు జిల్లా వై. యస్. ఆర్ కాంగ్రెస్ పార్టీ మునిసిపల్ విభాగం అధ్యక్షురాలుగా నియమించడము పట్ల పలువురు ఆమెకు హర్షము వ్యక్తం చేసారు. ఈ సందర్బంగా కోవూరు మండలం జడ్పీటీసీ కవర గిరి శ్రీలత మాట్లాడుతూ పార్టీ కొరకు పని చేసే మహిళకు పార్టీ అధిష్టానం ప్రాముఖ్యత ఇచ్చి నందున సహకరించిన నేతలకు. జిల్లా పార్టీ అధ్యక్షులు గోవర్ధన్ రెడ్డికి, మాజీ మంత్రి ప్రసన్నకుమార్ రెడ్డికి తాను కృతజ్ఞతలు తెలిపారు.

## రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ టీడిపి కార్యకర్తను పరామర్శించిన డాక్టర్ అర్జున్ రెడ్డి



**కోవూరు /మార్చి విజ్ఞాన్ )** బుచ్చిరెడ్డిపాలెం పట్టణంలో రోడ్డు ప్రమాదంలో గాయపడి, న తెలుగుదేశం పార్టీ కార్యకర్త సయ్యద్ మతీన్‌ను కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి తనయులు యువనేత డాక్టర్అర్జున్రెడ్డి శుక్రవారం పరామర్శించారు. డాక్టర్ అర్జున్ రెడ్డి మతీన్ నివాసానికి వెళ్ళి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. బాధితుడికి మెరుగైన వైద్యం అందేలా చూడాలని కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. మతీన్ త్వరగా కోలుకోవాలని ఈ సందర్భంగా ఆయన ఆకాంక్షించారు. ప్రమాదం కారణంగా ఇబ్బందుల్లో ఉన్న మతీన్ కుటుంబాన్ని ఆదుకోవాలనే ఉద్దేశంతో డాక్టర్ అర్జున్ రెడ్డి తన వంతు సహాయంగా మతీన్ కుటుంబ సభ్యులకు 20 వేల రూపాయల ఆర్థిక సహాయం అందజేశారు. కష్టసమయంలో తమ ఇంటికి వచ్చి పరామర్శించడమే కాకుండా ఆర్థిక సహాయం చేసిన డాక్టర్ అర్జున్ రెడ్డి మతీన్ మరియు ఆయన కుటుంబ సభ్యులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.

## ఆత్మకూరులో ప్రపంచ ల్యాబ్ టెక్నీషియన్ దినోత్సవాన్ని నిర్వహించిన ల్యాబ్ టెక్నీషియన్

ప్రపంచ ల్యాబ్ టెక్నీషియన్ దినోత్సవ సందర్భంగా కేక్ కట్ చేసుకుని ఆత్మకూరు పట్టణంలో ఉన్న ల్యాబ్ టెక్నిక్స్ అందరూ సంతోషాన్ని వ్యక్తపరచుకున్నారు. డాక్టర్ కు పేషెంట్లు మధ్య వారధి లాగా ఉండి రక్త పరీక్షల ద్వారా వ్యాధి నిర్ధారణ చేస్తూ వారు అనారోగ్య పాలైన ఒక సేవా దృక్పథంతో ఈ ఉద్యోగాలలో కొనసాగుతున్నారు.. ప్రభుత్వ హాస్పిటల్ లో సుమారు 20 సంవత్సరాల నుంచి కాంట్రాక్ట్ పద్ధతుల్లో పనిచేస్తూ చాలీ చాలని వేతనాలతో వారి కుటుంబాన్ని నెట్టుకొని వస్తున్నారు. కరోనా సీజన్లో ఎంతోమంది కరోనా బారిన పడి ప్రాణాలు పోగొట్టుకున్నారు అయినా ప్రభుత్వాలు మారుతున్నాయి వీరిని మాత్రం పర్మినెంట్ ఉద్యోగస్తులుగా ఇంతవరకు గుర్తింపు ఇవ్వలేదు. ఇకనైనా కాంట్రాక్ట్ లో పని చేస్తున్నటువంటి ల్యాబ్ టెక్నీషియన్ లను రెగ్యులర్ చేయాలని ఈ సందర్భంగా వారు డిమాండ్ చేశారు.. ఈ కార్యక్రమంలో సందాని, చల్లా సుధాకర్ చంద్రమౌళి రామయ్య రమేష్ ఖాదర్ దేవేంద్ర నాగేశ్వరరావు తదితర ల్యాబ్ టెక్నీషియన్లు హాజరయ్యారు..

Printed by : KomalaguntaNageswararao, D.No.16-256/3,Up Stair,Near Hanuman Temple, Sankaraiah Bulidings, Rayaji Street, Nellore,Sri Potti Sriramulu Nellore Dist, ANDHRAPRADESH PIN NO -524001
Published by : KALIKI UDAYKUMAR REDDY D.No. Lig1- 697, Kallurupalli Housing Board Colony, Nellore- 524004, S.P.S.R. Nellore District.
Owned by : KALIKI UDAYKUMAR REDDY D.No. Lig1- 697, Kallurupalli Housing Board Colony, Nellore- 524004, S.P.S.R. Nellore District.
Printed at : Deepakroshan Graphics, Digital & Multicolour Printers, D.No.16-256/3,Up Stair,Near Hanuman Temple, Sankaraiah Buildings, Rayaji Street, Nellore,Sri Potti Sriramulu Nellore Dist, ANDHRAPRADESH PIN NO -524001
Published at : D.No. Lig1- 697, Kallurupalli Housing Board Colony, Nellore- 524004, S.P.S.R. Nellore District.
Editor : KALIKI UDAYKUMAR REDDY D.No. Lig1- 697, Kallurupalli Housing Board Colony, Nellore- 524004, S.P.S.R. Nellore District.